షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు                తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 10 జనవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-



# కేసీఆర్ మౌనం ఎన్నాళ్లు?

- భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు జనంలోకి ఎప్పుడు వస్తారు?
- సంవత్సరం గడిచిపోయినా ఇప్పటివరకు ఆయన శాసనసభలోకి అడుగుపెట్టలేదు.
- చిన్న ప్రమాదం కారణంగా కొద్ది మాసాలపాటు విశ్రాంతిలో ఉన్నప్పటికీ ఆయన ఫామ్ హౌస్ నుంచే రాజకీయాలు చేస్తూ ఉన్నారు.

**హైదరాబాద్**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు జనంలోకి ఎప్పుడు వస్తారు? 2023వ సంవత్సరం నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓడిపోయిన తర్వాత నుంచి ఆయన తన గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లోనే ఉంటున్నారు. సంవత్సరం గడిచిపోయినా ఇప్పటివరకు ఆయన శాసనసభలోకి అడుగుపెట్టలేదు. శాసనసభ్యుడిగా శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. చిన్న ప్రమాదం కారణంగా కొద్ది మాసాలపాటు విశ్రాంతిలో ఉన్నప్పటికీ ఆయన ఫామ్ హౌస్ నుంచే రాజకీయాలు చేస్తూ ఉన్నారు. కొద్ది రోజులు ఓటమి భారం, ఆ తర్వాత ప్రమాదంలో గాయపడి విశ్రాంతి, ఆ వెనువెంటనే కూతురు కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కొన్ని మాసాలపాటు జైలుకు వెళ్లడం.. వీటితోటే మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకి సంవత్సర కాలం గడిచిపోయింది. ఆయన ఆరోగ్యం బాగుపడింది. కవిత జైలు నుంచి వచ్చారు. అయినా ఆయన ఇంకా బయటికి రావడంలేదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్దలు ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా కవ్వించినా ఆయననుండి ఎటువంటి స్పందనా లేదు. 'కెసిఆర్ సభకు వస్తే ఏ విషయం మీదనైనా - మిగతా3లో



## ఇండ్లను నిర్మించే బాధ్యత ప్రభుత్వానిదే

- 95 శాతం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఫిర్యాదుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్**

ఇందిరమ్మ లబ్ధిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్లు గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకురావడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో - మిగతా3లో

## గలీజు పనులు రేవంత్ చేస్తడు.. మాకు ఆ ఖర్మ పట్టలేదు

- నిన్ను ఎవరూ ముఖ్యమంత్రి కింద చూస్తలేరు..
- కనపు సింహాసనంపై శునకాన్ని కూర్చుండబెడితే.. ఆ బుద్ధిరాదు..
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ సెటైర్లు..!
- గలీజు పనులు రేవంత్ చేస్తడు.. మాకు ఆ ఖర్మ పట్టలేదు
- వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటాం..
- 'ఫార్ములా-ఈ రేస్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లోనే ఉంచాలి
- కష్టపడి తొలిసారి భారత్‌కు మొదటిసారి తీసుకువచ్చాం.



**హైదరాబాద్**

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు వచ్చేందుకే ఫార్ములా-ఈ రేస్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. అవినీతి లాంటి గలీజు పనులు రేవంత్‌రెడ్డి చేస్తడు తప్పా తాము చేయమని, మాకు ఆ ఖర్మ పట్టలేదని కుండబద్దలు కొట్టినట్లుగా ఏసీబీ - మిగతా3లో

## ప్రవాసీ భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్

1. ఎన్నారైల కోసం ప్రత్యేక టూరిస్ట్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ
1. అత్యంత నైపుణ్యం కలిగిన దేశం
1. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్ట్ రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు
1. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు.
1. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం

# ట్రైబల్ వెల్ఫేర్ ల్యాండ్ కబ్జాదారుల కబంధ హస్తాల్లో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి







**కంటైనర్లు వేసి అడ్డ దారిలో ట్రైబల్ వెల్ఫేర్ ల్యాండ్ ను కాజేసేందుకు స్కెచ్**

**పరోక్షంగా సహకరిస్తున్న దుండిగల్ రెవెన్యూ అధికారులు**

**వరుస కథనాలు, ఫిర్యాదు లకు స్పందించని అధికారులు**

ఫోటో09కుత్బుల్లాపూర్ లో..సర్వే నంబర్ 120/11 ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన కంటైనర్లు

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 09**

కాపాడాల్సిన వాడే కాటేసినట్లుంది రెవెన్యూ అధికారుల తీరు,ప్రభుత్వ స్థలమైనా ప్రజా ప్రయోజన స్థలమైనా ఖాళీజాగా కనిపిస్తే చాలు కబ్జాదారులు వాలిపోతున్నారు,దొమ్మరపోచంపల్లి సర్వే నంబర్ 120/11 లో కంటైనర్లు వేసి ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కొందరు కబ్జాదారులు స్కెచ్ వేశారు,కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,దుండిగల్ మండల పరిధిలోని సర్వే నంబర్ 120/11 లోని రెండు ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమిని అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ రావు ఆదేశాలతో 9 సంవత్సరాల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలు కోసం కేటాయించారు,స్థానిక ఎమ్మెల్యే కె.పి.వివేకానంద, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు లు ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో కలిసి హాస్టల్ భవన నిర్మాణాల కోసం 2019లో భూమిపూజ చేశారు,

కబ్జా దారులు కోర్టును ఆశ్రయించడంతో హాస్టల్ భవన నిర్మాణానికి బ్రేక్ పడింది,కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగా సదరు భూమిలో కంటైనర్లు వేసి కబ్జాలు జోరుగా సాగిస్తున్నారు,కబ్జాలపై వరుసగా వార్తా కథనాలు వెలువడుతున్నా రెవెన్యూ అధికారులకు పలు ఫిర్యాదులు అందినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు,గత 5 నెలల నుండి కబ్జాల పర్వం జోరందుకుంది,కాసులకు కక్కుర్తి పడుతున్న రెవెన్యూ అధికారులు కబ్జాదారుల కు పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి,కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జా లతో కనుమరుగవుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం,

**స్థానిక ఆర్ ఐ కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి,**

సర్వే నంబర్ 120 లో 59 జీవో పేరుతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

**ట్రైబల్ వెల్ఫేర్ కోసం కేటాయింపులు ఇలా..**

దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 120 లోని ప్రభుత్వ భూమిని అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ రావు 2015లో ట్రైబల్ వెల్ఫేర్ విభాగం కమీషనర్ అభ్యర్ధన మేరకు ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల కోసం అనువైన ప్రభుత్వ భూమిని కేటాయించాలంటూ సిఫారసు చేశారు,పరిశీలించిన స్థానిక రెవెన్యూ అధికారులు 120/11 లోని ప్రభుత్వ భూమిని ఐదు సబ్ డివిజన్లు గా విభజించి 2016 జులై 8న ప్రొసీడింగ్ నంబర్. ఎల్సీ3/2226/2016 కింద 0.25 గుంటలు,ప్రొసీడింగ్ నంబర్.ఎల్సీ3/2185 కింద 0.20 గుంటలు,ప్రొసీడింగ్ నంబర్.ఎల్సీ3/2184 కింద 0.20 గుంటలు,ప్రొసీడింగ్ నంబర్.ఎల్సీ3/2183 కింద 0.20 గుంటలు,ప్రొసీడింగ్ నంబర్.ఎల్సీ3/2178 కింద 0.20 గుంటలు మొత్తం 2.25 ఎకరాల ప్రభుత్వ భూమిని ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల కోసం కేటాయించారు,అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్యే కె.పి వివేకానంద,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శాసన మండలి సభ్యుడు శంభిపూర్ రాజులు ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో కలసి 2019 లో భూమి పూజ చేశారు,కబ్జాదారులు కోర్టుకు వెళ్లడంతో నిర్మాణాలు భూమి పూజ దశలోనే ఆగిపోయాయి,కోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడంలేదు.

**కోర్టును తప్పుదోవపట్టిస్తూ..**

దొమ్మర పోచంపల్లి సర్వే నంబర్ 120/11 లోని ప్రభుత్వ భూమిని కాజేసేందు కొందరు కబ్జాదారులు స్కెచ్ వేశారు,ఈ క్రమంలో కోర్టును పక్కదోవ పట్టిస్తూ సర్వే నంవర్ 127 లోని ప్రయివేట్ భూమిని చూపిస్తూ సర్వే నంబర్ 120/11 ప్రభుత్వ భూమికి కోర్టులో తప్పుడు పత్రాలు సమర్పించి కోర్ట్ ఆర్డర్ ను అడ్డంపెట్టుకొని 58,59 జీవో ల పేరుతో అక్రమ నిర్మాణాలకు తెరలేపారు,

**ట్రైబల్ వెల్ఫేర్,**

రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంతో విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి,ఆర్డీఓ చర్యలతో నైనా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడేనా.

**ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు..**

సర్వే నంబర్ 120/11 ప్రభుత్వ భూమిలో జరుగుతున్న కబ్జాలపై తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్ ను వివరణ కోరగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు,ఫిర్యాదులు అందాయని,కబ్జాలు తొలగించాలంటూ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు,

ఆదేశాలు జారీ చేసి నెలలు గడుస్తున్నా స్థానిక ఆర్ ఐ కబ్జాల పై చర్యలు చేపట్టకపోవవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

# హస్తిన పీఠం కోసం .. బీజేపీ స్కెచ్



ంంంంన్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పాలనకు చరమ గీతం పాడాలని బీజేపీ కృత నిశ్చయంతో ఉంది. ఆ క్రమంలో బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులోభాగంగా పార్టీ సందేశాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకు వెళ్లాలని నిర్ణయించింది. దీంతో ఈ రోజు.. అంటే గురువారం సాయంత్రం 4.00 గంటలకు ఢిల్లీ ఎన్నికల కోసం.. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులతో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు. పార్టీ గెలుపు వ్యూహాలపై వారితో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ సందర్భంగా చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, సునీల్ బన్సాల్ సహా ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు.

ఢిల్లీలో బీజేపీ అధికారానికి దూరమై రెండు దశాబ్దాలు దాటింది. నాటి నుంచి ఢిల్లీలో అధికారం అందుకోవాలని ఆ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఢిల్లీలో బీజేపీ అధికార పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకొంది. అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకొంది. ఇప్పటికే వరుసగా రెండు సార్లు అధికారాన్ని అందుకొన్న ఆప్.. మరో సారి అంటే ముచ్చటగా మూడో సారి అధికారాన్ని అందుకోవాలని ఓ ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. అందుకోసం ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన పరివారంతో తనదైన శైలీలో ఆయన ముందుకు వెళ్తున్నారు. అదీకాక.. ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఆప్ నేతలు మనీష్ సిసోడియా, అరవింద్ కేజ్రీవాల్ తదితరులను వరుసగా ఈడీ అరెస్ట్ చేసింది. దీంతో మనీష్ సిసోడియా అరెస్ట్ అయిన వెంటనే తన ఢిల్లీ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేశారు. కానీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మాత్రం తన పదవికి రాజీనామా చేయలేదు. ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయాలంటూ బీజేపీ గట్టిగా డిమాండ్ చేసింది. కానీ ఆయన తన సీఎం పదవికి మాత్రం రాజీనామా చేయలేదు. కేజ్రీవాల్‌కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ కేబినెట్‌లోని మంత్రి అతిషిని ఏకగ్రీవంగా ఆప్ ఎమ్మెల్యేలు ఎన్నుకొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి.. ముఖ్యమంత్రిగా మరోసారి తాను బాధ్యతలు చేపట్టడం ద్వారా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తన నిర్ధోషత్వాన్ని నిరూపించుకొంటానని కేజ్రీవాల్.. తన రాజీనామా చేసే సమయంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అలా మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకొంటానని ఆయన స్పష్టం చేశారు. అలాంటి వేళ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు ఈ ఎన్నికల్లో ఎలాగైన గెలిచి.. అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ పకడ్బందీగా వ్యూహ రచన చేస్తోంది. గతేడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. మరి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఢిల్లీ ఓటరు పట్టం కట్టనున్నాడు అనేది తెలియాలంటే మాత్రం ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆగాల్సి ఉందన్నది సుస్పష్టం. నూఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్నాయి. ఫిబ్రవరి 8వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి.

# ప్రవాసీ భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్



**భువనేశ్వర్ జనవరి 9 :** విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది.ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను.. ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు.

18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ సహా అతిథులు ఉండగా.. తొలి స్వాగత గీతం 'బసుధైవ కుటుంబం'ను ప్రదర్శించారు. అనంతరం విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎన్నారైలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విదేశాంగ మంత్రి ప్రసంగం అనంతరం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సదస్సులో రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా కంగాలూ ప్రవాస సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

**ప్రవాసీ భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్**

ఈరోజు ఉదయం 10.45 గంటల ప్రాంతంలో ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించగా, తర్వాత ప్రవాసీ భారతీయ టూరిస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఆయన పచ్చజెండా ఊపి రిమోట్‌గా ప్రారంభించారు. తరువాత %చీ=×%లను ఉద్దేశించి, %ూవీ% మోదీ ఇలా అన్నారు. "మిత్రులారా, మేము మీ సౌలభ్యం, సౌకర్యానికి చాలా ప్రాముఖ్యతనిస్తాము. మీ భద్రత, శ్రేయస్సు మా మొదటి ప్రాధాన్యత. మన విదేశీ భారతీయులు ఎక్కడ ఉన్నా, సంక్షోభ సమయాల్లో వారికి సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాము. నేటి భారత విదేశాంగ విధానానికి మార్గదర్శక సూత్రాలలో ఇదీ కూడా ఒకటని పేర్కొన్నారు.

**అత్యంత నైపుణ్యం కలిగిన దేశం**

రాబోయే అనేక దశాబ్దాల వరకు, భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ, అత్యంత నైపుణ్యం కలిగిన జనాభా కలిగిన దేశంగా ఉంటుంది. నైపుణ్యం కలిగిన ప్రతిభావంతుల కోసం ప్రపంచ డిమాండ్‌ను భారత్ తీరుస్తుంది. నైపుణ్యం కలిగిన ప్రతిభావంతుల కోసం ప్రపంచ డిమాండ్‌ను తీర్చగల సామర్థ్యం భారతదేశానికి ఉందనే విషయాన్ని కూడా ప్రధాని చెప్పారు. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ నిన్ననే భువనేశ్వర్ చేరుకున్నారు. ఈసారి ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో జనవరి 8 నుంచి 10 వరకు భువనేశ్వర్‌లో నిర్వహిస్తున్నారు.

**మీ వల్ల నేను..**

"మీ అందరినీ కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. మీ అందరి నుంచి నేను పొందిన ప్రేమ, ఆశీర్వాదాలను నేను ఎప్పటికీ మరచిపోలేను. ఈ రోజు నేను మీ అందరికీ కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఎందుకంటే మీ వల్ల నేను తల ఎత్తుకునే అవకాశం వచ్చింది. గత 10 సంవత్సరాలలో, నేను చాలా మంది ప్రపంచ నాయకులను కలుసుకున్నాను. వారందరూ తమ తమ దేశాల్లోని భారతీయ ప్రవాసులను అభినందిస్తున్నారు. దీని వెనుక పెద్ద కారణం మీ సామాజిక విలువలు." – ప్రధాని మోదీ

**ఈ ట్రైన్ సామర్థ్యం**

ప్రవాసుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ రైలు 'ప్రవాసీ తీర్థ దర్శన్ స్కీమ్'లో భాగం. ఇది విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సహకారంతో రూపొందించబడింది. ఈ రైలు భారతదేశంలోని ప్రధాన పర్యాటక, మతపరమైన ప్రదేశాలతో సహా పలు గమ్యస్థానాలను సందర్శిస్తుంది. జనవరి 9, 1915న మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి తిరిగి వచ్చిన జ్ఞాపకార్థం జనవరి 9న దీనిని ప్రారంభించారు. ఇది %చీ=×%ల కోసం ప్రత్యేక పర్యాటక రైలు. ఇది ఢిల్లీలోని నిజాముద్దీన్ నుంచి బయలుదేరి మూడు వారాల పాటు అనేక పర్యాటక, మతపరమైన ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలను సందర్శిస్తుంది. దీని సామర్థ్యం 156 మంది ప్రయాణికులు.

# రెండు రోజుల్లో రూ.71 వేల కోట్ల లాభం




**ముంబై :** దేశంలోని అతిపెద్ద కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు మరోసారి ఊపందుకున్నాయి. గత రెండు రోజుల్లో కంపెనీ షేర్లు 4 శాతానికి పైగా ఎగిశాయి. కంపెనీకి చెందిన 36 లక్షల మంది వాటాదారులు భారీ లాభాలను ఆర్జించారు. రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.71 వేల కోట్లు పెరిగింది. ఆ తర్వాత దేశంలోనే అతిపెద్ద కంపెనీ మార్కెట్ క్యాప్ మరోసారి రూ.17 లక్షల కోట్లు దాటింది. గతేడాది కంపెనీ షేర్లు ఇన్వెస్టర్లకు ప్రతికూల రాబడులను అందించాయి. ఇన్వెస్టర్లకు కంపెనీ షేర్లు నష్టాలను కలిగించడం కొన్నాళ్ల తర్వాత కనిపించింది. స్టాక్ మార్కెట్‌లో కంపెనీ గణాంకాలు ఎలా కనిపిస్తున్నాయో చూద్దాం.ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు వరుసగా రెండో రోజు కూడా పెరిగాయి. అది కూడా ట్రేడింగ్ రోజులో సెన్సెక్స్, నిఫ్టీలు పూర్తి ఒత్తిడిలో ఉన్నప్పుడు కూడా రిలయెన్స్ షేర్లు లాభాలను చూశాయి. స్టాక్ మార్కెట్ ముగిసిన తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 1.70 శాతం లాభంతో రూ.1,262 వద్ద ముగిశాయి. ట్రేడింగ్ సెషన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు కూడా రూ.1,270.70 వద్ద గరిష్ట స్థాయికి చేరాయి. అయితే, కంపెనీ షేర్లు ఒక రోజు ముందు రూ.1,240.90 వద్ద ముగియగా, బుధవారం రూ.1,251.20 వద్ద పెరుగుదలతో ప్రారంభమయ్యాయి. ముగింపు ధరను బట్టి లెక్కిస్తే, రెండు రోజుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో 3.59 శాతం పెరుగుదల కనిపించింది. బుధవారం గరిష్ఠ స్థాయి నుంచి లెక్కిస్తే, రెండు రోజుల్లో కంపెనీ షేర్లు 4.30 శాతం వరకు పెరిగాయి. సోమవారం కంపెనీ షేర్లు రూ.1,218.20 వద్ద ముగియగా, బుధవారం కంపెనీ షేర్లు రూ.1,270.70కి చేరాయి. ఈ కాలంలో కంపెనీ షేర్లలో రూ.52.5 పెరుగుదల కనిపించింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రాబోయే రోజుల్లో కంపెనీ షేర్లు మరింత పెరిగే అవకాశం ఉంది. కంపెనీ షేరు మాత్రం 52 వారాల గరిష్ఠ స్థాయి కంటే 21.56 శాతం దిగువన ట్రేడవుతోంది. అంటే కంపెనీ షేర్లు ఇప్పటికీ రికార్డు స్థాయి కంటే రూ.346.95 దిగువన ట్రేడవుతున్నాయి. జూలై 8న కంపెనీ షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,608.95కి చేరాయి. కాగా డిసెంబర్ 20న కంపెనీ షేర్లు 52 వారాల కనిష్ట స్థాయి రూ.1,202.10కి చేరాయి. కొన్నాళ్ల తర్వాత, గతేడాది కంపెనీ షేర్లు ఇన్వెస్టర్లకు ప్రతికూల రాబడులను అందించాయి. రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ క్యాప్ భారీగా లాభపడింది. డేటా ప్రకారం, సోమవారం కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.16,48,448.55 కోట్లు. రెండు రోజుల్లో రూ.17,19,490.70 కోట్లకు పెరిగింది. అంటే రెండు రోజుల్లో ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.71,042.15 కోట్లు పెరిగింది. అయితే, 52 వారాల గరిష్ట సమయంలో కంపెనీ మార్కెట్ క్యాప్ రికార్డు స్థాయి రూ.21,77,205.13 కోట్లకు చేరుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.4,57,714.43 కోట్లుగా ఉంది.

## రూ.1,033 కోట్లతో శబరిమల అభివృద్ధి



**తిరువనంతపురం:** కేరళలోని ప్రసిద్ధ శబరిమలను రూ.1,033.62 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సన్నిధానం, పంపా, ట్రక్ రూట్ వంటి కీలక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి బ్లూప్రింట్ రూపొందించారు. మొత్తం రూ.778.17 కోట్ల వ్యయంతో సన్నిధానం ప్రాంతాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశ పనులకు రూ. 600.47 కోట్లు, 2028–2033 మధ్య చేపట్టనున్న రెండో దశ పనులకు రూ. 100.02 కోట్లు, 2034–39 మధ్య చేపట్టనున్న మూడో దశ పనులకు రూ.77.68 కోట్లు కేటాయించనున్నారు. కాగా, అయ్యప్ప స్వామి సన్నిధానం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతకు భంగం కలుగకుండా లేఅవుట్ ప్లాన్ రూపొందించినట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాంతాన్ని ఎనిమిది జోన్‌లుగా విభజించినట్లు పేర్కొంది. మకరవిళక్కు (మరక జ్యోతి) దృశ్యాలు కనిపించేలా, భక్తుల రద్దీని నియంత్రించేలా రెండు ఓపెన్ ప్లాజాలు నిర్మించనున్నట్లు వెల్లడించింది. మరోవైపు అటవీ మార్గంలో ప్రయాణించే యాత్రికుల సురక్షితం, సౌకర్యం కోసం వాహన రూట్ లేఅవుట్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మార్గంలో షెల్టర్లు, విశ్రాంతి భవనాలు నిర్మిస్తారు. రోడ్డుకు రెండు వైపులా అత్యవసర వాహన లేన్, పర్యావరణ పునరుద్ధరణ కోసం బఫర్ జోన్‌లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ. 47.97 కోట్ల వ్యయంతో ట్రక్ రూట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. తొలి దశ పనులకు రూ.32.88 కోట్లు, రెండో దశ పనులకు రూ.15.50 కోట్లు కేటాయించనున్నారు. కాగా, పంపా అభివృద్ధికి రూ.207.48 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు. మొదటి దశకు రూ. 184.75 కోట్లు, 2028–33 మధ్య రెండో దశ పనులకు రూ.22.73 కోట్లు కేటాయిస్తారు. శబరిమల మాస్టార్ ప్లాన్ ప్రకారం పంపా, ట్రక్ రూట్ అభివృద్ధికి కలిపి మొత్తం రూ. 255.45 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

## ఢిల్లీలోని సీఎం బంగ్లాపై రాజకీయం

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం దగ్గర హైడ్రామా కొనసాగుతోంది. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పుడు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉంది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతోంది. ఢిల్లీ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సీఎం అధికారిక బంగ్లాను విలాసవంతంగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారని బీజేపీ ఆరోపణలకు గుప్పిస్తుంది. ఈ సందర్భంలో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియా ప్రతినిధులతో కలిసి బంగ్లా వద్దకు చేరుకుని, 'మేము నిజం చూపిస్తాం' అని అన్నారు. అయితే, శాంతిభద్రతల సమస్యల కారణంగా పోలీసులు వారిని ఆపారు. పోలీసులు తమను ఎందుకు ఆపుతున్నారని అడుగుతూ ఆప్ నాయకులు ఆందోళనకు దిగారు. ఢిల్లీ సీఎం బంగ్లాలో బంగారు టాయిలెట్, స్విమ్మింగ్ పూల్, మినీబార్ ఉన్నాయని బిజెపి ఆరోపిస్తుంది. అంతకుముందు మంగళవారం ఢిల్లీ సీఎం అతీషి తనకు సీఎం బంగ్లాను లాక్కున్నారని ఆరోపించారు. అయితే ముఖ్యమంత్రులకు బంగ్లాలు ఎలా కేటాయిస్తారో తెలుసా?ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ బుధవారం ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నారు. పోలీసులు వారిని ఎక్కడ అడ్డుకున్నారు. సాక్షాత్తూ సీఎం నివాసాన్ని శీష్ మహల్ అని, సీఎం నివాసంలో బంగారంతో తయారు చేసిన టాయిలెట్, బార్, స్విమ్మింగ్ పూల్ ఉన్నాయని ఆరోపణలను బట్టబయలు చేసేందుకు ఆప్ పార్టీ నేతలు సీఎం సభకు వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ సీఎం నివాసం ఎదుట నిరసనకు దిగారు. రెండోసారి కూడా తనకు సీఎం నివాసం ఇవ్వలేదని, తనను నివాసం నుంచి గెంటేశారని గతంలో సీఎం అతిషి పేర్కొన్నారురాజధాని ఢిల్లీలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి) ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో సహా మంత్రులందరికీ బంగ్లాలను కేటాయిస్తుంది. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా తర్వాత అతిషి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పిడబ్ల్యుడి) వారికి సివిల్ లైన్స్, 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ముఖ్యమంత్రి నివాసాన్ని కేటాయించింది. అయితే ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి నివాసం ఆమ్ ఆద్మీ పార్టీ, భారతీయ జనతా పార్టీల మధ్య రాజకీయ సమస్యగా మారింది. దీనికి సంబంధించి రెండు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. సీఎం అతిశికి రెండుసార్లు సీఎం నివాసం కేటాయించినా తీసుకోలేదని బీజేపీ ఆరోపించింది.అన్ని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి, మంత్రుల నివాసాల కేటాయింపు కోసం శాఖలు ఉన్నాయి. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో. ఇది రాష్ట్ర రెవెన్యూ శాఖ బాధ్యత. ముఖ్యమంత్రి, మంత్రుల నివాసాలను కేటాయించేది రాష్ట్ర రెవెన్యూ శాఖ ..

## శివంగిలా...సుశీలా

జైపూర్ : శివంగిలాగా బౌలింగ్ చేసే ఆ బాలిక పేరు సుశీలా మీనా ఈమె టాలెంట్ ను సోషల్ మీడియా వేదికగా దిగ్గజ ఇండియన్ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ వెలుగులోకి తెచ్చాడు. దీంతో ఆనాటి నుంచి సుశీలా మీనా సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ అయింది. ఈమె గురించి చాలామంది ఆరా తీయడం మొదలుపెట్టారు. అలా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. సుశీలా మీనా రాజస్థాన్ రాష్ట్రంలో పేద కుటుంబంలో జన్మించింది. అయినప్పటికీ క్రికెట్ మీద ఆమెకు విపరీతమైన ఇష్టం. అందువల్లే అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలో తన టాలెంట్ ను నిరూపించుకుంది. అయితే ఆ అమ్మాయి చేస్తున్న బౌలింగ్ సచిన్ టెండూల్కర్ కు ఆసక్తి కలిగించింది. అందువల్లే ఆమె బౌలింగ్ చేస్తున్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నాడు. అది కాస్త మిలియన్ వ్యూస్ సొంతం చేసుకు. దీంతో ఒక్కసారిగా ఆమె గురించి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈక్రమంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్ ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలో పర్యటించారు. ఆ సమయంలో సుశీల తో సరదాగా క్రికెట్ ఆడారు. సుశీల వేసిన ఒక బంతి రాజ వర్ధన్ సింగ్ రాథోడ్ బ్యాట్ మధ్యలో నుంచి వెళ్లి వికెట్లను పడగొట్టింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో పెను సంచలనంగా మారింది.సుశీలలో ఉన్న ప్రతిను చూసిన రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్( ఆమెకు ట్రైనింగ్ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి అయ్యే ఖర్చును మొత్తం రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ భరిస్తోంది. సుశీలలో అద్భుతమైన ప్రతిభ ఉందని.. ఆ ప్రతిభకు సరైన శిక్షణ తోడైతే ఆమె అద్భుతంగా రాణిస్తుందని మాజీ క్రికెటర్లు వ్యాఖ్యానిస్తున్నారు. " సుశీల వయసు చిన్నదే. అయినప్పటికీ ఆమె బౌలింగ్ వేసే విధానం అద్భుతం. అందువల్లే సచిన్ టెండూల్కర్ మనసును చూరగొన్నది. తన ఏకంగా ఆమె వీడియోను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆమె బౌలింగ్ వేసే విధానం ఎంత నచ్చితే సచిన్ ఆ పని చేశారో అర్థం చేసుకోవచ్చు. సుశీలకు ఇదేవిధంగా ట్రైనింగ్ ఇస్తే ఆమె భవిష్యత్ కాలంలో టీమిండియా మహిళల జట్టును కచ్చితంగా లీడ్ చేయగలుగుతుంది. ఎందుకంటే ఆమె మట్టిలో పుట్టిన మాణిక్యం. కచ్చితంగా క్రికెట్ కు సరికొత్త సొబగులు అద్దుతుంది. ఇందులో ఏమాత్రం అనుమానం లేదని" మాజీ క్రికెటర్లు వ్యాఖ్యానిస్తున్నారు.రాజస్థాన్ బాలిక సుశీల మీనా.. అచ్చం జహీర్ ఖాన్ మాదిరిగా బౌలింగ్ వేస్తూ అదరగొడుతోంది. గతంలో ఈమె టాలెంట్ ను సచిన్ బయటపెట్టాడు. తాజాగా ఈ బాలిక బౌలింగ్లో కేంద్రమంత్రి రాజ్య వర్ధన్ సింగ్ రాథోడ్ ను క్లీన్ బౌల్డ్ చేసింది.

# అట్టహాసంగా ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం





**బడ్జెట్ స్కూల్స్ కి భరోసా ఇచ్చిన మంత్రి తుమ్మల**

**ట్రస్మాకు అండగా ఉండటం నా బాధ్యత**

**ట్రస్మా రాష్ట్ర కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల మేనేజ్ మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం బుధవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బహదూర్ పల్లి లోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇంచార్జి కొలను హనుమంత రెడ్డి, పెద్దపల్లి వికలాంగుల కో -ఆపరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, కేజీ టు పీజీ కన్వీనర్ మువ్వ శ్రీనివాస్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సతీష్ రెడ్డి, కూకట్ పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవ్ రావు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో ట్రస్మా ముఖ్య సలహాదారుడిగా యాదగిరి శేఖర్ రావు రాష్ట్ర అధ్యక్షులుగా శివరాత్రి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఐ వి. రమణ రావు, కోశాధికారిగా ఎస్. జయసింహ గౌడ్, లు ప్రమాణస్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల సంఘం ఇంత బలంగా ఉన్నదంటేనే తమకు సమస్యలు ఉన్నట్లు అర్థమవుతుందని, మీ బడ్జెట్ స్కూల్స్ సమస్యల పరిష్కారానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బడ్జెట్ స్కూల్స్ కి భరోసా ఇచ్చారు. ట్రస్మా పుట్టింది ఖమ్మంలో అని గర్వంగా చెప్పుకుంటున్నానని అందుకోసం ట్రస్మా కు తోడుగా ఉండటం నా బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం కు చెందిన దివంగత ట్రస్మా రాష్ట్ర అధికార ప్రతినిధి సూరపనేని శేషు కుమార్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు. కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల సమస్యలు తనకు తెలుసునని తాను ఎల్లప్పుడూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు అండగా ఉంటానన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ట్రస్మ రాష్ట్ర కమిటీతో త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో రాపోలు విష్ణువర్ధన్ రావు వర్కింగ్ ప్రెసిడెంట్ టి వెంకటయ్య రాష్ట్ర సలహాదారులు అన్ని రాష్ట్రాలకు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఘనంగా విజ్ఞాన మేళా





**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 09:** విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి విజ్ఞాన మేళాలు దోహదపడుతాయి అని శ్రీ రామకృష్ణ విద్యాలయ వ్యవహర్త విద్యావేత్త బండి రాజుల శంకర్ అన్నారు. పాఠశాల వార్షిక విద్యా క్యాలెండర్ ప్రకారం గురువారం రోజున పాఠశాలలో విజ్ఞాన మేళాను నిర్వహించినట్లు శంకర్ తెలిపారు. ఈ మేళాలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు అందరు విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. వివిధ అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులను శంకర్ అభినందించారు. మేళాను సందర్శించిన విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తరిగొప్పుల రమేశ్ ఆచార్యులు జూకంటి సిద్ధులు నారగోని భీమేశ్ బొడ్డు రమేశ్ గుగ్గిళ్ళ జయమ్మ మాడిశెట్టి వాణిశ్రీ కదారి పరమేశ్వరి కాయితి అన్నపూర్ణ అంబాల ప్రసన్న లక్ష్మి అప్పాల స్వరూప మైల బోయిన పావని ఆత్మకూరి దీపిక యెనగందుల కవిత యానాల సరస్వతి వంగపల్లి శ్వేత పిడిశెట్టి భవాని ఎం కృష్ణమూర్తి వేముల భవాని హేమలత మౌనిక విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రవేట్ పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి జనవరి 09:** శ్రీరంగాపురం మండల కేంద్రంలోని వివిధ ప్రైవేటు పాఠశాలలను ఎంఈఓ హనుమంతు సందర్శించారు ఈ సందర్భంగా ఎంఈఓ హనుమంతు మాట్లాడుతూ విద్యార్థుల యొక్క వివరాలను కచ్చితంగా ఆన్ లైన్ లో పొందుపరచాలని, ఆన్ లైన్ లోని తప్పొప్పులను సరిచేసి కచ్చితమైన డేటాను పొందుపరచాలని,విద్యా ప్రమాణాలను పెంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చర్లపల్లి డివిజన్ లో ఘనంగా క్రిస్మస్ నూతన సంవత్సర వేడుకలు 2025



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 09:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ సెలబ్రేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి పాస్టర్స్ ఫెలోషిప్ (సి.పి.ఎఫ్) అధ్యక్షులు పాస్టర్ రెవ బి.వి.పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజక వర్గ క్రిస్టియన్ సంఘాల కో ఆర్డినేటర్ సద్గునరావు మహేష్ గౌడ్ పాస్టర్లు రెవ జాన్ మాణిక్యాలరావు జీ సామెల్ విద్యాసాగర్ స్టీవెన్ జైపాల్ నాగేశ్వరరావు,శేఖర్ కిషోర్, సాధు సుందర్ సింగ్ డానియల్ సామెల్,సాల్మన్ రాజ్, రాజు పాస్టరమ్మలు, క్రైస్తవ నాయకులు, విశ్వాసులు డివిజన్ నాయకులు అనిల్, లోక్ నాథ్ పాల్గొన్నారు. ఆధ్యాత్మికమైన వాక్యోపదేశాన్ని రెవ డాక్టర్. మాదాస్ ఫిలిం పంచుకున్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వం
# హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

- ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలి
- సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ
- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రశాంత్
- గ్రామ పార్టీ నాయకులు పోతురాజు రాములు



**షణ్ముఖ వెలుగు వనపర్తి జిల్లా ప్రతినిధి జనవరి 09:** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ హయాంలో నే ప్రతి గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని మార్కెట్ చైర్మన్ ప్రశాంత్,గ్రామ పార్టీ నాయకులు పోతురాజు రాములు అన్నారు. వనపర్తి జిల్లా మదనా పురం మండలం తీర్మాలయాపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కొరకు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన పనులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ గ్రామ,మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలోని అభివృద్ధి పనులకు,మౌలిక వసతుల కల్పన కు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు.పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని,రోడ్లపై వర్షం నీరు నిలువకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ.. సీసీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగన్న, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాసులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ,శేషన్న, దరూరు రాములు,గట్టన్నా, రాఘవేంద్ర, గట్టు, వెంకటనారాయణ,రవీందర్ రెడ్డి,టిసి నాగన్న,హనుమాన్ రావు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు
# అండగా మోడల్ స్కూల్ సిబ్బంది - పిల్లలు





**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** మల్లాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు రామ నిఖిల మరియు మానాల సాయి హర్షిని ల తండ్రులు కొన్నిరోజుల క్రితం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. ఆ ఇద్దరు విద్యార్థినుల కుటుంబానికి బాసటగా మోడల్ స్కూల్ సిబ్బంది మరియు పిల్లలు కలిసి ఒక్కొక్కరికి 12 వేల రూపాయలను ఆర్థిక సహాయంగా మొత్తం 24 వేల రూపాయలను గురువారం రోజున వారి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూమేష్ ఉపాధ్యాయులు శ్రీకాంత్ వెంకటేష్ మధుమోహన్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్
## అయోధ్య నగర్ లో రాపిడో డ్రైవర్ హత్య




**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** అనుమానాస్పద స్థితి లో ఓ యువకుడు హత్య కు గురయ్యాడు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అయోధ్య నగర్ లో ర్యాపిడో డ్రైవర్ గా పనిచేస్తున్న యువకుడు తన గదిలో కాళ్ళు చేతులు కట్టేసి ఉరి వేసి చంపబడ్డాడు. కడప జిల్లాకు చెందిన శివకుమార్ రెడ్డి(26) ర్యాపిడో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ అయోధ్య నగర్ లోని ఒక ఇంట్లో మరో వ్యక్తితో కలిసి కిరాయికి ఉంటున్నాడు. ఉదయం ఎంత సేపటికి డోర్ తెరవక పోవడంతో, అనుమానం వ్యక్తం చేసిన ఇంటి యజమాని, చుట్టూ పక్కల వారి సహాయంతో తలుపులు తొలగించి చూడగా చేతులు కాళ్ళు,నోరు కట్టేసి, ఫ్యాన్ కు ఉరి తాడుతో వేలాడుతూ కనిపించాడు. మృతుడు అనుమానాస్పదంగా వేలాడుతూ ఉండటం చూసిన ఇంటి యజమాని జీడిమెట్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు,క్లూస్ టీమ్ యువకుడినీ అర్ధరాత్రి సమయంలో హత్య చేసి, ఆత్మహత్య గా చిత్రీకరించడం కోసం ప్రయత్నం చేసినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు.ఈ మేరకు అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసి జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**సహచరడి మీద అనుమానం**

గదిలో ఉండే మరో వ్యక్తి ఈ హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలు ఏమిటీ అయ్యి ఉంటాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ప్రేమ వ్యవహార మా? ఆర్థిక లావాదేవి లా? లేక ఏదైనా గొడవ జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తాత గుర్తుకొస్తున్నాడు అని మనవడు ఆత్మహత్య






**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** తాత గుర్తుకు వస్తున్నారు.. అందుకే చనిపోతున్నాను అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న మనవడు. తాత మరణాన్ని తట్టుకోలేక మనవడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తన తాత మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడని కొంపల్లి శివాలయం సమీపంలో ఉండే మనోజ్(27) మనోవేదనకు గురయ్యాడు. తాత తనను రమ్మంటున్నాడని, తన వద్దకు వెళ్తానని తరచూ ఇంట్లో చెప్పేవాడు.ఈ క్రమంలో తన గదిలో ఉరేసుకుని చనిపోయాడు మనోజ్. తాత గుర్తొస్తున్నాడు.. అందుకే చనిపోతున్నాను అంటూ సూసైడ్ నోట్ రాసి చున్ని తో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## అంగడి ఎల్లయ్య సేవలు మరువలేనివి

**పిడి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు రంగ రవి**




**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 09:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు పంగ అంజయ్య అధ్యక్షతన సిపిఐ(ఎంఎల్) ఎన్డీఆర్ గ్రామ నాయకుడు అంగడి ఎల్లయ్య సంతాప సభను గురువారం నిర్వహించారు. ఎల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశానికి పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి హాజరై మాట్లాడుతూ అంగడి ఎల్లయ్య ప్రజా ఉద్యమంలో 35 సంవత్సరాలకు పైగా అందించిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి పిడి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు తుంగ శ్రవణ్ కుమార్ పివైఎల్ రాష్ట్ర నాయకులు పంగ నాగరాజు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జాన్నె మల్లేష్ కోశాధికారి కొత్తపేట చంద్రయ్య అంగడి ఎల్లయ్య కుమారులు అంగడి కరుణాకర్ అంగడి సూర్యం కూతుళ్లు పద్మ కస్తూరి అంజుల బంధుమిత్రులు పాల్గొన్నారు.

## కొత్త గా ఎన్నికైన హుజురాబాద్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులను సన్మానించిన మహిళా కాంగ్రెస్ పార్టీ





**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి జనవరి 09:** ఇటీవల నూతనంగా ఎన్నికైన హుజురాబాద్ మండల అధ్యక్షులు కొల్లూరి కిరణ్ ను పట్టణ అధ్యక్షులు మేకల తిరుపతి లను సన్మానించిన హుజురాబాద్ మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లంకదాసరి లావణ్య ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల మహిళా కాంగ్రెస్ నాయకురాల్లు ధూబాసి స్వరూప అంబాల కోమల బూరుగుల శృతి శనిగరం తిరుమల పులి దీపిక గొస్కుల రిబ్కా రాధ తదితరులు పాల్గొన్నారు

# పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలి

ఏ.ఐ.యు.కే.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి



**షణ్ముఖ వెలుగు వరంగల్ ప్రతినిధి జనవరి 09:** జనవరి 9 న ఇండియా డిమాండ్ డే గా జరపాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో పి.ఆర్.ఓ. పి.విశ్వ ప్రసాద్ కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రతినిధి బృందం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశ రైతాంగానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లో నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన అన్ని రకాల పంటలకు 50 శాతం పెట్టుబడి కలిపి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించిన రైతులపై అక్రమంగా బనాయించిన కేసులను రద్దు చేయాలని ఉద్యమం సందర్భంగా మరణించిన అమర రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అజిత్ సింగ్ దల్లే వాలతో చర్చించి దీక్షను ఉపసంహరణ చేయించి ఆయన్ని కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతు భరోసాను 15000 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు 12000 రూపాయలు ఇస్తామని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం చేయడం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయడమేనని అన్నారు. అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయకుండా కోతలు విధించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు పంటలకు 15 వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో పాటు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కోశాధికారి మైదం పాణి ఏఐయుకేఎస్ వరంగల్ జిల్లా నాయకులు అర్షం సుధాకర్ సతీష్ ప్రకాష్ రమేష్ నరేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కమలా పూర్ మండల కేంద్రంలో టీజేయు

# ప్రెస్ క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరించిన కమలా పూర్ సిఐ ఈ హరికృష్ణ





**షణ్ముఖ వెలుగు కమలా పూర్ ప్రతినిధి జనవరి 09:** తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను కమలా పూర్ సిఐ హరి క్రిష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం ప్రజా శ్రేయస్సు కోరే వారే జర్నలిస్టులని ఆయన అన్నారు. అలాగే కమలా పూర్ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ప్రింట్ ఎలక్ట్రానిక్ విలేకరులకు మండల అధికారులకు, మండల ప్రజలకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలా పూర్ మండల తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ గౌరవ అధ్యక్షులు డా మౌటం కుమారస్వామి కమలా పూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పెర్క రమాకాంత్, ఉపాధ్యక్షులు పుల్ల రాజేష్,జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల నాగరాజు జిల్లా కార్యదర్శి జూపాక విక్రం, మండల సహాయ కార్యదర్శి ఎండి సందాని,మండల కోశాధికారి కొండపర్తి సురేష్ కార్యవర్గ సభ్యులు డాకూరి రాజశేఖర్, కొలుగూరి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవ్ పూర్ మండల

# కేంద్రంలో డిటిఎఫ్ శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



**భూపాలపల్లి జిల్లా షణ్ముఖ వెలుగు మహాదేవ్ పూర్ ప్రతినిధి జనవరి 09:** మహాదేవ్ పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షులు మడక మధు అధ్యక్షతన ఎంఆర్సి మహాదేవ్ పూర్ లో డిటిఎఫ్ క్యాలెండర్ డైరీ లను స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రకాష్ రెడ్డి డిటిఎఫ్ అనేది నిబద్ధతతో జాతి నిర్మాణంలో గొప్ప పాత్ర పోషిస్తుందని డిటిఎఫ్ ఉపాధ్యాయులు ఎక్కడ ఉంటే ఆ పాఠశాల విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రతి ఉపాధ్యాయుడు కూడా డిటి ఎఫ్ కార్యకర్త లాగా పనిచేస్తే ఆ పాఠశాల ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు అలాగే జెడ్పిహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల మహాదేవ్ పూర్ రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ గా ఎన్నికైనందున పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు గదె సమ్మిరెడ్డి, మాజీ జడ్పిటిసి గుడాల అరుణ మాజీ ఎంపీటీసీ ఆకు తోట సుధాకర్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు , వామన్ రావు ,శ్రీనివాస్ రెడ్డి, ఖురేషి అస్రార్ కాటారం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ వేమునూరు ప్రభాకర్ రెడ్డి తో పాటుగా డి టి ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుపతి రెడ్డి రమణారెడ్డి డిటిఎఫ్ జిల్లా బాధ్యులు దేవేంద్ర, వీరేశం ,సమ్మయ్య, ప్రభాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి సారంగపాణి మండల బాధ్యులు తిరుపతి రెడ్డి ఎర్రయ్య రజిత కళ్యాణి మల్లేశం లీలా రాణి మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

# ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం







**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ టౌన్ ప్రతినిధి జనవరి 09:** హుజురాబాద్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించిన1986 – 88 బ్యాచ్ కు సంబంధించిన ఎంపిసి బైపిసి విద్యార్థులు కలిసి మైత్రి వెల్ఫేర్ అసోసియేషన్ గా ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల అట్టి బ్యాచ్ కు సంభందించిన వేల్పుల రత్నం కళాశాలను సందర్శించారు, ఈ క్రమంలో కళాశాలలో శిథిలావస్థలో వున్న ఆర్వో వాటర్ ప్లాంట్ ను గమనించి, అధ్యక్షుడితో చర్చించి అట్టి వాటర్ ప్లాంట్ పునరుద్దరణ కు కావాల్సిన మొత్తాన్ని మిగతా సభ్యులతో కలిసి గురువారం రోజున కళాశాలకు వచ్చి 25000/- లను చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ వి.అంజనేయరావు కు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ వి ఆంజనేయ రావు మాట్లాడుతూ మీ యొక్క ఆర్థిక సహాయం వల్ల కళాశాల విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందజేసిన వారు గా, ముందు తరాలకు ఆదర్శవంతంగా ఉంటారు అని కొనియాడి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమం లో మైత్రి వేల్పేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సురేందర్ రెడ్డి,కార్యదర్శి జి.రవీందర్, బండ.శ్రీనివాస్, గోస్కుల శ్రీనివాస్,వేల్పుల.రత్నం,మిగతా సభ్యులు పాల్గొన్నారు. వీరందరికీ కళాశాల అధ్యాపక సెక్రటరీ జి.తులసిదాస్, అధ్యాపకులు,విద్యార్థిని, విద్యార్థులు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి ఏడిఏ పద్మావతి





**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి జనవరి 09:** అడ్డ గూడూరు మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి ఆలేరు ఏడిఏ పద్మావతి ఫర్టిలైజర్ షాపులో ఉన్న ఎరువుల స్టాక్, రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొడ్డు గూడెం గ్రామంలో రైతు సమ్మె మల్లయ్య పొలాన్ని పరిశీలించారు. అడ్డ గూడూరు మండలంలో ఇప్పటి వరకు 5100 ఎకరాల్లో వరి నాట్లు వేయడం జరిగిందని తెలిపారు. వరి నాటు వేసే ముందు పలు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు, సలహాలను రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో పాండురంగ చారి ఏఈఓ లు దయాకర్ అక్షర రైతులు తదితరులు పాల్గొన్నారు

## రెండవ సారి అడ్డ గూడూరు మండల బిజెపి పార్టీ అధ్యక్షునిగా ననుబోతు సైదులు



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి జనవరి 09:** భారతీయ జనతా పార్టీ అడ్డ గూడూరు మండల అధ్యక్షునిగా రెండోసారి ననుబోతు సైదులు ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ననుబోతు సైదులు మాట్లాడుతూ నాపై నమ్మకంతో మరోసారి అడ్డ గూడూరు బిజెపి మండల అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బొబ్బ భాగ్యరెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య,తుంగతుర్తి కన్వీనర్ కాప రవి కుమార్, జాయింట్ కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర్లు రావు లకు మరియు మండల సీనియర్ నాయకులకు మండల నాయకులకు గ్రామ శాఖ బూత్ అధ్యక్షులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అధికారమే లక్ష్యంగా పనిచేస్తానని కార్యకర్తలకు అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పార్టీ అభివృద్ధికి నిరంతరం తోడ్పడి ఉంటానని అన్నారు.

## కొండాపూర్ గ్రామానికి చెందిన ఏ. నాగేంద్ర కు ఎల్ ఓ సి మంజూరు చేయించిన ప్రభుత్వ విప్



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి జనవరి 09:** జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి మండలం కొండపూర్ గ్రామానికి చెందిన ఏ. నాగేంద్రకు అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 2 లక్ష 50 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేపించారు.. కాగ ఎల్ఓసి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రి పొన్నం ను కలిసిన చేర్యాల మాజీ ఎమ్మెల్యే నాగపూరి రాజలింగం



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 09:** పాత చేర్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నాగపూరి రాజలింగం హైదరాబాదులోని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు ఈ సందర్భంగా జనగామ రాజకీయ పరిస్థితుల గురించి పలు అంశాలు చర్చించారు, చేర్యాల ను వెంటనే రెవిన్యూ డివిజన్ చేయాలని కోరారు, డివిజన్ ఏర్పాటుపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ భవన్ లో మానిటరింగ్ చేస్తున్న హరీష్ రావు



**షణ్ముఖ వెలుగు బంజారాహిల్స్ ప్రతినిధి జనవరి 09:** తెలంగాణ భవన్లో బిఆర్ ఎస్ సీనియర్ నేతలతో కలిసి ఏసీబీ విచారణను మాజీ మంత్రి హరీష్ రావు సమీక్షిస్తున్నారు. బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణ నేపథ్యంలో తెలంగాణ భవన్ లో ఉండి హరీష్ రావు మానిటరింగ్ చేస్తున్నారు. మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి,పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు హరీష్ రావు తో కలిసి ఉన్నారు.

## సీసీ రోడ్ల పనులకు

# శంకుస్థాపన చేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ






**మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ విలేజ్, హెచ్ ఎంటి స్వర్ణ పూరి కాలనీ ,కృషి నగర్ కాలనీ లో రూ.112.00 లక్షల రూపాయల అంచనా వ్యయం తో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి శంకుస్థాపన చేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి జనవరి 9:** ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 3 కోట్ల రూపాయల తో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, దానిలో భాగంగా మియాపూర్ డివిజన్ లో 1.12 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పన కు పెద్ద పీట వేస్తానని పిఏసి చైర్మన్ గాంధీ అన్నారు. సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని గాంధీ తెలియచేసారు. అదే విధంగా మియాపూర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాల సంతోషకరం అని అదేవిధంగా మౌలిక వసతుల కల్పన కు పెద్ద పీట వేస్తామని ,సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అరికెపూడి గాంధీ తెలియజేశారు పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని ఎమ్మెల్యే గాంధీ చెప్పడం జరిగినది. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పన కు తనవంతు కృషి చేస్తానని, మియాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## చేపలు పట్టే క్రమంలో వ్యవసాయ బావిలో పడి నేదునూరి కార్తీక్ అనే బాలుడు మృతి





**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** సరదాగా చేపల వేటకు వెళ్ళి వ్యవసాయ బావిలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం రోజున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొర్రేపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్ (14) బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి రాత్రి అయినా కూడా ఇంటికి తిరిగి రాక పోవడంతో చుట్టుపక్కల వారిని బంధువులను , స్నేహితులను తెలుసుకొనగా ఆచూకీ లభించకపోవడంతో బాలున్ని వెతికే క్రమంలో కదుర్క నర్సయ్య కు చెందిన వ్యవసాయ బావిలో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మృతుని తండ్రి నేదునూరి రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే రాజు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉద్యమించాల్సిన బాధ్యత మాదిగ విద్యార్థులదే..

**ఎమ్మార్పీఎస్ మరిపెడ మండలం వైస్ ప్రెసిడెంట్ తప్పెట్ల సురేష్**



**షణ్ముఖ వెలుగు మరిపెడ మండల ప్రతినిధి జనవరి 09:** భారత అత్యున్నత న్యాయ వ్యవస్థ సుప్రీం కోర్టు ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ ఉప కులాలను మోసం చేస్తున్నాడని, ఆ మోసకారి రేవంత్ ప్రభుత్వం పై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగ విద్యార్థులు యుద్ధ సైనికులై ఉద్యమించాలని మరిపెడ మండలం ఉపాధ్యక్షుడు తప్పెట్ల సురేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే టీచర్ ఉద్యోగ నియామకాల్లో మాదిగ ఉప కులాలు తీవ్రంగా నష్ట పోయాయని మరల గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ మరియు హాస్టల్స్ వార్డెన్ తదితర ఇతర ఉద్యోగ నియామకాల పరీక్షలు నిర్వహిస్తూ ఎస్సి కోటాలో ఉన్న ఉద్యోగాలను మాదిగలకు దక్కకుండా మాలలకు దోచి పెట్టే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం పై మాదిగ విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని మన ఉద్యోగాల కోసం హక్కుల కోసం భవిష్యత్తు కోసం యుద్ధ సైనికులుగా మారి వర్గీకరణను అమలు చేయించుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణను తక్షణమే రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ తీసుకునే ఉద్యమ కార్యాచరణకు విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు

## మండల విద్యాధికారి చే టిఎస్ యూటీ ఎఫ్ క్యాలెండరు ఆవిష్కరణ




**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** మల్లాపూర్ మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో రాఘవ పేట కాంప్లెక్స్ పాఠశాలలో గురువారం రోజున నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు . ఈ కార్యక్రమం లో భాగంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు విద్య ఫలాలు అందేలా చేయాలన్నారు. మండలాన్ని విద్యలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. మండలంలోని విద్యార్థులందరికి నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బిబ్బురి రాజేందర్ , ఉత్కం నిరంజన్ గౌడ్,ఉపాధ్యక్షులు జరుపుల సుధాకర్,కోశాధికారి సిరిగాని గణేష్ ఎఫ్ డబ్యూ ఎఫ్ కన్వీనర్ వేముల శ్రీనివాస్, రాజా మల్లేష్, ఉదయ్ కుమార్, రాజా శేఖర్ బాధ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ యూనివర్సిటీ చదరంగం పోటీలకు ఎంపికైన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు




**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు జనవరి 09:** చెన్నైలో శుక్రవారం నుండి జరిగే సౌత్ జోన్ యూనివర్సిటీ చదరంగం పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇందులో శాతవాహన యూనివర్సిటీ నుండి బాలికల విభాగంలో రెండవ స్థానంలో శ్రీనిజ నాలుగవ స్థానంలో స్వాతి , బాలుర విభాగంలో రెండవ స్థానంలో నితిన్ ఐదవ స్థానంలో ఆర్ అరుణ్ జేఎన్టీయూ నుండి వరుణ్ ఎంపికైనట్లు జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య ,అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పట్ల కోచ్ లు సృజన్ అనూష్ అభిరామ్ రేవిక్ పిల్లల తల్లిదండ్రులు తదితరులు అభినందనలు తెలిపారు.

# గలీజు పనులు రేవంత్ చేస్తడు.. మాకు ఆ ఖర్మ పట్టలేదు

-మొదటిపేజీ తరువాయి

అధికారులు స్పష్టం చేశానని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత పది సంవత్సరాల్లో పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ సాధించిన మన నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో నిబద్ధతతో ఎక్కడా పైసా అవినీతికి తావులేకుండా పని చేశానని విచారణలో ఏసీబీ అధికారులకు చెప్పాను. ఏసీబీ అధికారులు 82 ప్రశ్నలు అడిగారు. కాకపోతే పాడిందే పటరా అన్నట్టు అడిగిందే అడుగుడు తప్ప కొత్త విషయం లేదు. రేవంత్‌రెడ్డి బలవంతంగా కేసు పెట్టించాడని వాళ్లకు అర్థమైంది. అధికారులు కూడా ఇబ్బందిపడుతున్నరు. ఎందుకంటే కేసులో విషయం లేదు' అన్నారు.

**వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటాం..**

'ఫార్ములా–ఈ రేస్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లోనే ఉంచాలి. కష్టపడి తొలిసారి భారత్‌కు మొదటిసారి తీసుకువచ్చాం. ఇక్కడ ఉంటేనే మన రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు హైదరాబాద్, తెలంగాణను ఒక ప్రధాన స్థావరంగా చేయాలని ఒక విజన్‌తో చేసిన పనితప్ప మరొకటి లేదు. పైసలు, అవినీతి లాంటి గలీజు పనులు రేవంత్‌రెడ్డి చేస్తడు తప్ప మేం చేయం. మాకు ఆ ఖర్మ పట్టలేదని కుండబద్దలు కొట్టినట్లు వాళ్లకు చెప్పిన. మీరు ఎన్నిసార్లు పిలిచినా వస్తానని, ఇబ్బంది లేదని చెప్పాను. వారికి ఒక విజ్ఞప్తి చేశాను. కేసు పెట్టారు, విచారణ చేస్తున్నారు పర్వాలేదు. ఇలాంటివి వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటం. మీ ప్రభుత్వం, మీరు ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని రకాల ప్రయత్నం చేసినా.. కేసీఆర్ సైనికులుగా మేం మాత్రం ఖచ్చితంగా ఈ సంవత్సరం మొత్తం ప్రజా సమస్యల గురించే మాట్లాడుతాం.. మీరు ఎత్తగొట్టిన రైతుభరోసా, మీరివ్వని రూ.4వేల పెన్షన్ గురించి మాట్లాడుతాం. ఇస్తానని చెప్పి మోసం చేసిన మహాలక్ష్మి రూ.2500 గురించి మాట్లాడుతాం. ఇస్తానని చెప్పిన 2లక్షల ఉద్యోగాల విషయంలో మా పిల్లల గురించి మాట్లాడుతం. కచ్చితంగా ప్రతి సమస్యను, ఆరు గ్యారంటీలు, 420 హామీలపై మాట్లాడుతాం. ఇలాంటి కేసులు వంద కేసులు పెట్టినా.. మాట్లాడడం వదిలిపెట్టమని చెప్పా'నని కేటీఆర్ పేర్కొన్నారు. కనపుపు సింహాసనంపై శునకాన్ని కూర్చుండబెట్టినా దాని బుద్ధి మారదంటూ సీఎం రేవంత్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ సెటైర్లు వేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' కేసు లేదు పీసు లేదు. ఇది ఒక లొట్టపీసు కేసు మాత్రమే. ఇందులో ఇంకా ఏం లేదు. ఈడికేలి పైసా పోయింది.. అక్కడ పైస ఉన్నది. అవినీతి ఎక్కడ జరిగిందని అడిగితే నీళ్లు నములుతున్నరు. అందుకే నేను రేవంత్‌రెడ్డిని అడుగుతున్న. నీకు పైశాచిక ఆనందం ఉంది. నేను జైలుకు వెళ్లినకాబట్టి అందరినీ జైలుకు పంపాలనే నీకు ఆనందం. నేను విదేశాలు తిరిగి పెట్టుబడులు తెచ్చినకాబట్టి నాకు విదేశాల స్థాయిలో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలని నాకుంది. నీకు, మాకు తేడా అదే'నన్నారు.

**నిన్ను ఎవరూ ముఖ్యమంత్రి కింద చూస్తలేరు..**

'ప్రపంచపటంలో హైదరాబాద్, తెలంగాణను పెట్టాలని మా నాయకుడు కేసీఆర్, మా కమిట్‌మెంట్. మేం నీలాగా రూ.50లక్షలతో దొరికిన దొంగలం కాదు. నీలా లుచ్చా పనులు చేసినోళ్లం కాదు. నీకు భయపడేవారు బీఆర్ఎస్ పార్టీలో, తెలంగాణలో ఎవరూ లేరు. ఇది నేను చెప్పడం కాదు.. మీరంతా చూస్తున్నరు. రాష్ట్రంలో ఎవరూ రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి కింద చూస్తలేదు. ఎవరైనా ఏమన్నా అంటే కేసులు పెట్టి లోపటేస్తరు. ఆయనెవరో పేరు మరిచిపోయారని నేను అనను. ఎందుకంటే నిన్ను ఎవరూ గుర్తుపడుతలేరు. సంవత్సరం అయినా కూడా నిన్ను ఎవరూ దేకపోతే నేనేం చేయాలి? అందుకే పెద్దలు ఎప్పుడో చెప్పారు. కనపు సింహాసనమున శునకమును కూర్చుండబెడితే.. దానికి ఆ బుద్ధి రాదు. అందుకే భయపడేది లేదు. బాధపడేది లేదు. ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వెళ్తా'నన్నారు.

**ఇది లొట్టపీస్ కేసే..**

'మీరంతా (బీఆర్ఎస్ శ్రేణులు) తదేక దీక్షతోని మన నాయకుడు కేసీఆర్ చెప్పినట్లుగా ఉద్యమంలో ఎంత కమిట్‌మెంట్‌తో పని చేసినమో.. అదే కమిట్‌మెంట్‌తో ముందుకు వెళ్దాం. వాళ్లు ఎన్ని ప్రశ్నలు వేసినా.. ఎన్ని సవాళు విసిరినా.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. కొత్త కొత్త కేసులు పెట్టినా భయపడేది లేదు. తలవంచేది లేదు. నిజాయితీకి ధైర్యం ఎక్కువ. ఎవరు ఏమనుకున్నా సరే.. ఇది లొట్టపీసు కేసే. ఆయన లొట్టపీసు ముఖ్యమంత్రే. బరాబర్ కొట్లాడు దాం.. గట్టిగా ముందుకు వెళ్దాం. నేతి బీరకాయలో ఎంత నెయ్యి ఉంటదో.. మైసూర్ బోండాలో ఎంత మైసూర్ ఉంట దో.. ఈ కేసులో ఉంది. కేసు లేదు తొక్క లేదు' అన్నారు.

**రేవంత్‌రెడ్డి ప్రశ్నలు పంపిస్తడేమో..**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు విచారణకు పిలిచారా? అని పలువురు ప్రశ్నించగా.. వాళ్ల వద్ద అడిగేందుకు ప్రశ్నలు లేవని.. రేవంత్‌రెడ్డి మళ్లీ పంపిస్తే పిలిస్తారు కావొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఇందులో ఏం ఉందని అడుగుతున్నరని తాను ఏసీబీ అధికారులను అడిగానన్నారు. ఫైల్ అందులో నుంచి ఇండ్లకు.. ఇండ్ల నుంచి అండ్లకు వెళ్లింది నీకు తీలుసా? అని అడుగుతున్నారని, ఒక మంత్రిగా తెలంగాణ బాగును కోరే వ్యక్తిగా.. నేను నిబ్దతతో మా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు ఈ–రేస్ ఇక్కడ ఉండాలని నిర్ణయం తీసుకున్నానని చెప్పానన్నారు.

ఒక పైసా అవినీతి, చిన్న తప్పుకానీ చేయలేదని.. చేసినట్లు మీ కేసులో మీరే రుజువు చేయలేకపోతున్నారని అన్నట్లు తెలిపారు. అక్రమ కేసు బనాయించి నాలుగు రోజులు జైలులో పెట్టాలనే పైశాచిక, శునకానందం నీకు (సీఎం) ఉంటే.. ఉండొచ్చు. కానీ, భయపడేది ఎవరూ లేరని, తమకు న్యాయస్థానాలపై విశ్వాసం ఉందని, న్యాయస్థానాల్లో తేల్చుకుంటామని.. మళ్లీ పిలిస్తే విచారణకు వెళ్తానని స్పష్టం చేశారు. రేపటి నుంచి బీఆర్ఎస్ నేతలు ఎక్కడివారంతా అక్కడ ప్రజాసమస్యలపై ప్రస్తావిస్తూ ముందుకు వెళ్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## బిజెపి హఫీజ్ పేట్ డివిజన్ అధ్యక్షులుగా ఎన్నికైన కైతాపురం జితేందర్

**బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి చేతుల మీదుగా భారతీయ జనతా పార్టీ హఫీజ్ పేట్ డివిజన్ అధ్యక్షులుగా ఎన్నికైన పత్రాన్ని స్వీకరించిన కైతాపురం జితేందర్**



**షణ్ముఖ వెలుగు హఫీజ్ పెట్ డివిజన్ జనవరి 09:** హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులుగా ఎన్నికైన కైతాపురం జితేందర్ మాట్లాడుతూ హఫీజ్ పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు సామ రంగారెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గం బిజెపి ఇంచార్జి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ లకు శేరిలింగంపల్లి అసెంబ్లీ సీనియర్ నాయకులకు బీజేపీ అధిష్ఠానం నాపై నమ్మకం ఉంచి హఫీజ్ పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు . డివిజన్ లో బీజేపి పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని, డివిజన్ లోని సమస్యలపై పోరాటం చేస్తూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా బిజెపి హఫీజ్ పేట్ డివిజన్ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు అందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు

## కోరుట్ల బాలాజీ బుక్ సెల్లర్స్ గుండం పల్లి పాఠశాలకు 26 డెస్కుల విరాళం



**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి జనవరి 09:** మండలంలోని గుండం పల్లి గ్రామంలోని పాఠశాలలో విద్యార్థుల సౌలభ్యం కొరకు లక్ష రూపాయల విలువ గల 26 డెస్కులను కోరుట్ల పట్టణంలోని శ్రీ బాలాజీ బుక్ సెల్లర్స్ మరియు అతని మిత్రులు కలిసి గురువారం రోజున విరాళంగా అందజేశారు. దీంతో విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. దాతలకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ బాలాజీ బుక్ సెల్లెర్స్ యజమాని స్వామి, వారి మిత్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర ప్రకాష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్నేహిత, ఉపాధ్యాయులు అంజయ్య, మదు, ఫహీమా, గీత, సంతోష్ కుమార్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రద్ధాకపూర్ న్యూ హెయిర్ కట్

# కొత్త లుక్ స్పెషలేంటో?

తెలుగులో సూపర్ క్రేజ్‌తోపాటు మంచి ఫ్యాన్ బేస్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ ప్రభాస్‌తో కలిసి నటించిన సాహో చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. శ్రద్ధాకపూర్ ఓ వైపు గ్లామరస్ రోల్స్ చేస్తూనే మరోవైపు నటనకు ఆస్కారమున్న పాత్రల్లో నటిస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటుంది. గతేడాది స్త్రీ 2 సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఈ భామ నెట్టింట ఎంత చురుకుగా ఉంటుందో తెలిసిందే. తాజాగా శ్రద్ధాకపూర్ న్యూ హెయిర్ కట్ చేయించుకుంది. సెలూన్‌లో హెయిర్ స్టైల్ సెట్ చేయించుకున్న తర్వాత సెల్ఫీ దిగింది శ్రద్ధాకపూర్ . కొత్త సంవత్సరం.. కొత్త జుట్టు.. అంటూ న్యూ హెయిర్ స్టైల్‌కు క్యాప్షన్ ఇచ్చింది. ఇప్పుడీ స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రద్ధాకపూర్ ఇలా కొత్త హెయిర్ స్టైల్ చేయించుకోవడం వెనుక సీక్రెట్ ఏమైనా ఉందా..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు మూవీ లవర్స్. స్త్రీ 2 తర్వాత శ్రద్ధాకపూర్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.



# ఆషిఖి3పై ఎక్జయిటింగ్‌గా యానిమల్ బ్యూటీ తృప్తి డిమ్రి




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఆల్ టైమ్ ఎవర్‌గ్రీన్ ఫేవరేట్ సినిమాలు కొన్నుంటాయి. ఆ జాబితాలో టాప్‌లో ఉంటుంది ఆషిఖి ఈ ఫ్రాంచైజీలో ఇప్పటికే ఆషిఖి 2 కూడా వచ్చిందని తెలిసిందే. అయితే ఇప్పుడిక ఆషిఖి3 టైం కూడా వచ్చేసింది. కార్తీక్ ఆర్యన్ హీరోగా ఈ సినిమా రాబోతున్నట్టు బీటౌన్ సర్కిల్ టాక్. కాగా ఈ సినిమాలో యానిమల్ హీరోయిన్ తృప్తి డిమ్రిని ఫీ మేల్ లీడ్ రోల్‌లో తీసుకోబోతున్నారని వార్తలు ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమాకు తృప్తి డిమ్రి సెటవదని భావిస్తున్న మేకర్స్ మరో భామను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారని బీటౌన్ సర్కిల్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి.

తాజా కథనాల ప్రకారం తృప్తి డిమ్రి ఈ ప్రాజెక్టు పట్ల ఎక్జయిటింగ్‌గా ఉన్నప్పటికీ.. మేకర్స్ మాత్రం ఈ భామ స్థానంలో కొత్తమ్మాయిని తీసుకోవాలని అనుకుంటున్నారని ఇన్‌సైడ్ టాక్. మరి మేకర్స్ రాబోయే రోజుల్లో దీనిపై ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. భూల్ భూలయ్యా 3 సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు కార్తీక్ ఆర్యన్. మరి ఈ క్రేజీ సినిమాపై రానున్న రోజుల్లో ఏదైనా స్పష్టత వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. యానిమల్ బ్యూటీ బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ మాధురీ దీక్షిత్‌తో సినిమా చేసేందుకు సైన్ చేసిందని బీటౌన్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రాన్ని జల్సా అండ్ తుమ్హారీ సులు ఫేం విక్రమ్ మల్హోత్రా డైరెక్ట్ చేయబోతుండగా.. మరిన్ని వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.

## సోషల్ మీడియాలో వేధింపులు..

# సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించిన మరో నటి

సోషల్ మీడియా ద్వారా వేధింపులు పెరిగిపోతున్నాయి. సామాన్యులతోపాటు పలువురు సెలబ్రిటీలు కూడా లైంగిక వేధింపులకు గురవుతున్నారు. మొన్నటికి మొన్న మలయాళీ బ్యూటీ హనీరోజ్.. సోషల్ మీడియా ద్వారా తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో నటికి కూడా అదే పరిస్థితి ఎదురైంది. కథానాయిక నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొంది. ఈ విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియా ద్వారా తనను ఇబ్బందికి గురిచేస్తూ, వేధిస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు తనను చంపేస్తానంటూ బెదిరింపు కామెంట్స్ పెడుతున్నట్లు తెలిపింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. నటి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, నిధి అగర్వాల్ ప్రస్తుతం రెండు భారీ ప్రాజెక్ట్స్ చేస్తోంది. ఇద్దరు సూపర్‌స్టార్లతో రెండు పాన్ ఇండియా చిత్రాల్లో మెరిసేందుకు సిద్ధమైంది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో 'హరిహర వీరమల్లు', పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సాబ్' (%ఞయిఖ ఞఖిఎ%)లో నటిస్తోంది. ఈ రెండు పాన్‌ఇండియా సినిమాలూ 2025లోనే విడుదల కానున్నాయి. ఇక ఈ రెండు చిత్రాలతోపాటు తెలుగు, తమిళంలో మరికొన్ని సర్‌ప్రైజింగ్ మూవీస్‌లో నటిస్తోంది ఈ ఇస్మార్ట్ భామ





# బ్యాక్ టు యాక్షన్ మూడ్

## కార్ రేసింగ్ టీంతో అజిత్‌కుమార్.. !

దుబాయ్ కార్ రేసింగ్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ భారీ ప్రమాదం నుంచి బయటపడ్డ సంగతి తెలిసిందే. దుబాయ్‌లో రేసింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా అజిత్ కారు ట్రాక్‌ను ఢీకొట్టింది. అయితే అప్రమత్తమైన అజిత్‌కుమార్ వెంటనే కారును కంట్రోల్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది.. స్వల్ప గాయాలతో కారులో నుంచి బయటపడ్డాడు అజిత్ కుమార్. అయితే అజిత్ కుమార్ అభిమానుల్లో జోష్ నింపే వార్త ఒకటి ఫొటోల రూపంలో బయటకు వచ్చింది. అజిత్‌కుమార్ రేసింగ్ టీంతో కలిసి ఫొటోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అజిత్‌కుమార్ రేసింగ్ గురించి అతని మేనేజర్ సురేశ్ చంద్ర మాట్లాడుతూ..ఈ శనివారం జరగనున్న ఎండ్యూరెన్స్ రేసులో పాల్గొనే నలుగురు డ్రైవర్లలో మిస్టర్ అజిత్ ఒకరు. ఆయన వరుసగా నాలుగు గంటలు డ్రైవింగ్ ప్రాక్టీస్ చేశారు. చివరగా దాదాపు 3-3.5 గంటలు డ్రైవింగ్ చేశాడు. అయితే కొంచెం దృశ్యమానత (విజిబులిటి)లో నెలకొన్న సమస్య కారణంగా జరిగిన ప్రమాదంలో కారు దెబ్బతిన్నది. అయితే ఆయనకు ఏం కాలేదు. అంబులెన్స్ స్పాట్‌కు చేరుకుంది. అజిత్ కారులో నుంచి బయటకు వచ్చి.. దగ్గరలో ఉన్న గ్రిడ్‌కు వెళ్లారు. వైద్యులు ఆయన ఆరోగ్యాన్ని పరిశీలించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయన నెక్ట్స్ ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా నేటి నుంచి యాక్షన్‌లోకి దిగుతారని చెప్పాడు. ఈ నేపథ్యంలో తాజా ఫొటోలు చూసిన అభిమానులు అజిత్‌కుమార్ యాక్షన్ మూడ్‌లోకి వచ్చేశాడంటూ సంబురాలు చేసుకుంటున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com